## గ్రామాల్లో 'వికసిత్ భారత్' యాత్ర

■ నిజాంపేట, జనవరి 2 : మండలంలోని జచ్చురాజ్‌పల్లి, జడ్చెరువుతండాలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న ఉజ్వలగ్యాస్, ఆయుష్మాన్ భారత్, జల్ యోజన, పీఎం కిసాన్, ఆవాస్ యోజనపై అధికారులు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి గోవిందు మాట్లాడుతూ.. పీఎం కిసాన్ లబ్ధిదారులు ఈ-కేవైసీ చేయించాలని, డ్రోన్ ఉపయోగం, నానో యూరియా(లిక్విడ్)పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ మల్లేశం, ఏవో సతీశ్, ఎంపీవో రాజేందర్, ఏపీజీవీబీ మేనేజర్ మురళీకృష్ణ, ఏఈవోలు శ్రీలత, కావేరి, గ్రామస్తులు చంద్రశేఖర్, నరేందర్, స్వామి, నరేశ్, మల్లేశం ఉన్నారు.

## నేడు ఉపాధ్యాయులకు సన్మానం

■ రామాయంపేట, జనవరి 2 : సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం తెలిపారు. రామాయంపేటలోని శ్రీకర ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రామాయంపేట, నిజాంపేట మండలానికి చెందిన 200 మంది ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లను సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే హన్మంతరావు హాజరవుతున్నారని తెలిపారు. సన్మాన కార్యక్రమానికి మహిళా టీచర్లు సమయానికి రావాలని కోరారు. సమావేశంలో బీసీ నాయకులు పట్నం చంద్రశేఖర్, చింతల శేఖర్, చింతల స్వామి, అల్లాడి వెంకటేశ్, సుంకోజు దామోదర్‌చారి, పోచమ్మల గణేశ్, శివకుమార్ ఉన్నారు.

## సంఘ సేవకులకు మంత్రి సన్మానం

■ రామాయంపేట, జనవరి 2 : హైదరాబాద్‌లో నిర్వహించిన సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలకు మంత్రి సీతక్క హాజరై మహిళా సంఘసేవకులను సన్మానించారు. సన్మానం పొందిన వారిలో రామాయంపేటకు చెందిన సంఘసేవకురాలు పోచమ్మల అశ్విని ఉన్నారు. మంత్రి సీతక్క తనను సేవకురాలిగా గుర్తించి, సన్మానించడం సంతోషంగా ఉందని అశ్విని తెలిపారు.

## స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

■ మెదక్ మున్సిపాలిటీ, జనవరి 2 : 2023-24 విద్యా సంవత్సరానికి మెదక్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఈ నెల 31లోగా epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

■ చిలిపిచెడ్, జనవరి 2 : మండలంలోని గౌతాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు మేలుకొలుపులో భాగంగా పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్సై షేక్ మహబూబ్ సూచించారు. షీ టీమ్ సేవలతోపాటు మూఢ నమ్మకాలు, ఆన్‌లైన్ మోసాలను వివరించారు. మద్యం తాగి, వాహనాలను నడపవద్దని, వాహనాదారులు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వదని తెలిపారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు సురేందర్,జనార్దన్, ఇసాక్, విఠల్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గెజిటెడ్ అధ్యాపకుల సంఘం
## జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

■ మెదక్ మున్సిపాలిటీ/ పాపన్నపేట, జనవరి 2 : గెజిటెడ్ అధ్యాపకుల సంఘం(711) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గాండ్ల శ్రీనివాస్, సురేందర్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన జరిగిన సమావేశంలో గెజిటెడ్ అధ్యాపకుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిని ఎన్నుకున్నారు. త్వరలో జిల్లాస్థాయి కమిటీని నియమిస్తామని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. శ్రీనివాస్ పాపన్నపేట జూనియర్ కళాశాలలో వృక్ష శాస్త్ర అధ్యాపకుడిగా, సురేందర్ కౌడిపల్లి జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.

## మధ్యాహ్న భోజన బిల్లులు ఇవ్వాలి
**★ ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య**

■ చిన్నశంకరంపేట, జనవరి 2 : మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఆయన మాట్లాడుతూ.. గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు బిల్లులు రాలేదన్నారు. దీంతో కార్మికులు అప్పులు చేసి మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపాల్, జైరుద్దీన్ తదితరులు ఉన్నారు.



నిజాంపేట : రజాక్‌పల్లిలో ఎంపీడీవో జగదీశ్వర్‌చారి



నర్సాపూర్‌లో మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్



కొల్చారం : రాంపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# తగ్గని రద్దీ.. తీరని రంది


■ లభించని 'ప్రజాపాలన' దరఖాస్తులు
■ కిటకిటలాడుతున్న మీసేవ, జిరాక్స్ సెంటర్లు
■ ప్రజల్లో సందేహాలు.. తీర్చని అధికారులు
■ జిల్లాలో కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ



మెదక్ రూరల్ : మాచవరంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ సంధ్యారాణి



రామాయంపేటలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్



తూప్రాన్ : గుండ్రెడ్డిపల్లిలో దరఖాస్తుల స్వీకరణ

మెదక్ రూరల్/ చిన్నశంకరంపేట/ శివ్వంపేట/ వెల్దుర్తి,/ రామాయంపేట/ నిజాంపేట/ చిలిపిచెడ్/ నర్సాపూర్, జనవరి 2 : మెదక్ మండలం పేరూరు, ర్యాలామడుగు, మాచవరం, మంబోజిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎంపీడీవో శ్రీరాములు, తహీసీల్దార్ శ్రీనివాస్ ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా అర్హులను గుర్తించడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి, గజగట్లపల్లి, మడూర్, సంగాయపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని స్పెషల్ ఆఫీసర్ విజయశేఖర్‌రెడ్డి తెలిపారు.

శివ్వంపేట మండలం రూప్లతండా, బొజ్యతండా, మల్లుపల్లితండా, సీతారాంతండాలో ఎంపీడీవో భారతి, తహసీల్దార్ శ్రీనివాస్‌చారి దరఖాస్తులను స్వీకరించారు.

వెల్దుర్తి మండలం కుకునూర్‌లో సర్పంచ్ ప్రీతి, ఎంపీటీసీ లక్ష్మితో కలిసి జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, తులసీరాం ప్రజాపాలన కార్యక్రమా న్ని ప్రారంభించారు. ఆరు గ్యారంటీలకు ఒకే దరఖాస్తులో వివరాలను నమోదు చేయాలని సూచించారు.

రామాయంపేట పట్టణంతోపాటు కోనాపూర్ గ్రామంలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఏవో రాజ్‌నారాయణ, మేనేజర్ శ్రీనివాస్, ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి ఉన్నారు.

నిజాంపేట మండలంలోని రజాక్‌పల్లి, వెంకటాపూర్(కె) గ్రామాల్లో ఎంపీడీవో జగదీశ్వర్‌చారి, ఎంపీవో రాజేందర్, ఏపీవో శ్రీనివాస్ దరఖాస్తులు స్వీకరించారు. తూప్రాన్‌తోపాటు గుండ్రెడ్డిపల్లి, యావాపూర్ గ్రామాల్లో దరఖాస్తులను తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో అరుంధతి స్వీకరిస్తున్నారు. చిలిపిచెడ్ మండలం సోమక్కపేట, శీలంపల్లి, రహీంగూడతండా, సామ్లాతండాలో ఎంపీపీ వినోద, వైస్ ఎంపీపీ విశ్వంభరస్వామి,తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీవో శశిప్రభ ప్రజాపాలన నిర్వహించారు. నర్సాపూర్ పట్టణంలోని 7, 8వ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణను మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌పరిశీలించారు.



రామాయంపేట : కోనాపూర్ గ్రామంలో ప్రత్యేకాధికారులు



వెల్దుర్తి : కుకునూర్‌లో దరఖాసులు స్వీకరిస్తున్న జడ్పీటీసీ



చిలిపిచెడ్ : సోమక్కపేటలో ఎంపీపీ వినోద, ఎంపీడీవో శశిప్రభ

# జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

■ కలెక్టర్ రాజర్షి షాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జిల్లా యంత్రాంగం



కలెక్టర్‌ను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లాస్థాయి అధికారులు

మెదక్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): అధికార యంత్రాంగం సమష్టిగా పనిచేసి జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా అదనపు కలెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, డీఆర్వో పద్మశ్రీ, అధికారులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఆర్డీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో రవిప్రసాద్, అధికారులు జయరాజ్, విజయలక్ష్మి, బ్రహ్మాజీ, రజాక్, హరికృష్ణ, బ్రహ్మారావు, ఇందిర, ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు జానకిరామ్‌సాగర్, వెంకటగోపాల్, వివిధ శాఖల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

### తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు
## గ్యారెంటీలకు అర్హులు
**★ అదనపు కలెక్టర్ రమేశ్**

కొల్చారం, జనవరి 2 : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేశ్ సూచించారు. కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు ప్రభుత్వ హామీలకు అర్హులన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎంపీవో లక్ష్మీనర్సింహులు, ఏపీవో మైపాల్‌రెడ్డి, ఏవో శ్వేత కుమారి, నాయకులు గొవర్ధన్‌రెడ్డి, పోచయ్య తదితరలు పాల్గొన్నారు.

# ఇస్లాంపూర్‌లో ఉచిత అంబులెన్స్ సర్వీస్

తూప్రాన్, జనవరి 2 : మండలంలోని ఇస్లాంపూర్‌లో సర్పంచ్ సుకన్యారమేశ్ గ్రామస్తుల సౌకర్యార్థం సొంత నిధులతో ఉచిత అంబులెన్స్ సౌకర్యాన్ని మంగళవారం ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు సుకన్య, రమేశ్ పదేండ్ల క్రితం ప్రజల తాగునీటి ఇబ్బందులను తీర్చడానికి సొంత నిధులతో బోరు వేయించి, నీటి కొరత తీర్చారు. గ్రామస్తులకు ఏ ఆపద వచ్చినా తానున్నాంటూ సొంత ఖర్చులతో చేతనైన సేవ చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులను సకాలంలో దవాఖానకు తరలించి, మెరుగైన వైద్యాన్ని కల్పించడానికి అంబులెన్స్ వాహనాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచారు. పదవుల కన్నా ప్రజాసేవలోనే ఆత్మతృప్తి లభిస్తుందని సర్పంచ్ సుకన్యారమేశ్ తెలిపారు. గ్రామస్తులకు ఉచితంగా స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి గ్రామానికి చెందిన తుమ్మ సత్యనారాయణ, పెంటమ్మ దంపతులు మనవడు విష్ణు జ్ఞాపకార్థం మినరల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ గజ్జెల లక్ష్మణ్, నాయకులు పోటర్ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, నరేశ్, వడ్డెపల్లి మల్లేశ్, శ్రీనివాస్ గౌడ్, రవీందర్, తిరుపతిరెడ్డి, ఆకుల శ్రీరాములు, మన్నె స్వామి, దర్శన్, కుర్మ మల్లయ్య, జోడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుకన్య, బీఆర్ఎస్ నేత రమేశ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.

NT-319403-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.